క్లుప్తంగా

దళితులపై దాడులు అరికట్టాలి

వాల్మీకిపురం : దళితులపై దాడులను అరికట్టాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల పట్టణానికి చెందిన జయరాంపై జరిగిన దాడికి నిరసనగా స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద శనివారం ధర్నా చేశారు. ఇన్‌చార్జ్ సీఐ నాగేంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేస్తామని తెలపడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమలో సుధాకర్, చంద్రయ్య, రవీంద్ర, ప్రేమ్ కుమార్, యర్రయ్య, రెడ్డిశేఖర్, వెంకటరమణ, శేషాద్రి, మూస్తూరి, ప్రసాద్, కొండయ్య, రామాంజులు, గురు ప్రసాద్, ప్రసాద్, కదిరప్ప, రమణ, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాహితీ బ్రహోత్సవాలకు ఆహ్వానం

కలికిరి : తిరుపతిలో ఆది, సోమవారాల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహోత్సవాలకు కలికిరి మండలానికి చెందిన రచయితలు, ఉపాధ్యాయులకు ఆహ్వానాలు అందాయి. సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ అయిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో సాహిత్య సదస్సులు, కవితోత్సవం, పుస్తకావిష్కరణలు, కళా ప్రదర్శనలు చేపట్టనున్నారు. కార్యక్రమాలకు కలికిరి మండలానికి చెందిన బ్రమరాంభిక, తణుకు గంగాధర్, వినాయకం ప్రకాష్, జరుగుమల్లి వీరయ్య, జె.సాయి లోకేష్‌లకు ఆహ్వానాలు అందాయి. ఈ మేరకు సాహితీ బ్రహోత్సవాలలో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు.

గోశాలకు దాణా వితరణ



దాణాతో గోశాల నిర్వాహకులు

తంబళ్లపల్లె: కన్నెమడుగు సమీపంలోని కణికలమ్మ గోశాలలోని పశువులకు ఆకలితీర్చేందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దాణా(ఫీడ్) వితరణగా ఇచ్చారు. శనివారం సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మహేష్, నాయకులు రావ, మద్దిరెడ్డిలు గోశాలకు వెళ్లారు. గోశాల నిర్వాహకులకు 20 బస్తాల దాణా, 5 ట్రాక్టర్ల పచ్చిగడ్డి (పశుగ్రాసం) అందజేశారు. గోశాల మేనేజర్ రామూర్తి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి దాతృత్వం, సహకారం మరుపురానిదని హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా శంకరంబాడి వర్ధంతి



రచయితల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాల్మీకిపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతం మా తెలుగు తల్లికి రచయిత శంకరంబాడి సుందరాచారి, వందేమాతరం గేయరచయిత బంకిం చంద్ర ఛటర్జీల వర్ధంతిని శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని గండబోయనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో రచయితల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ శంకరంబాడి సుందరాచారి, బంకిం చంద్ర ఛటర్జీల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు కిషోర్, శేఖర్, శ్రీలత, హేమలత, సిరాజున్నీసా, ఉషారాణి, శ్రీకాంత్, విద్యార్థులకు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ్ పక్వాడా

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మడుమూరు పంచాయతీ అముల్దార్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా అంగన్‌వాడీలకు సరఫరా అయ్యే బాలామృతంతో రొట్టెలు, జావ, లడ్డూలు, రాగి పిండి రొట్టెల తయారీ, మొలకెత్తిన గింజలు, తాజా కూరగాయలను అంగన్‌వాడీ కార్యకర్త పుష్పలత ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సర్పంచ్ నాగరత్నం నాయుడు సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ములకలచెరువు మండలం చౌడసముద్రంకు చెందిన వి.శివలక్ష్మి (35) మద్యం విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో 20 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

రాయచోటి టౌన్ (వీరబల్లి) : ప్రతి ఒక్కరూ భక్తి భావాలను అలవర్చుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం వీరబల్లి మండల పరిధిలోని గ్రందేవాండ్లపల్లెలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి పూజలు నిర్వహించారు.

ప్రతి ఇంటి నుంచి జగనన్నకు మద్దతు

నిమ్మనపల్లె : గత నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ లబ్ధిని పొందిన ప్రతి ఇంటి నుంచి జగనన్నకు మద్దతు కూడగడుతామని మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గారబురుజు రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీన్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లె శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువ మాచిరెడ్డిగారిపల్లెలో మా నమ్మకం నువ్వే జగన్ ప్రచారంలో భాగంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జగనన్న స్టిక్కర్లను ప్రదర్శించారు. ఇంటింటికీ వెళ్లి గత, ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. వారి వద్ద నుంచే వైఎస్సార్ సీపీ పాలనకు, మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి కావాలంటూ మద్దతు పలికేలా అవగాహన కల్పించారు. అనంతరం ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. 8296082960 నెంబరుకు సంబంధిత కుటుంబ సభ్యుల నుంచి ఫోన్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి ప్రజా నాయకుడిగా ప్రజల మనసుల్లో నిలిపోయారన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెలకొల్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ రెడ్డివెంకటేష్, నాయకులు యుగంధర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బాబురెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, నవీన్, రెడ్డి భాస్కర, షావలి, చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.



ఎగువమాచిరెడ్డిగారిపల్లెలో స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం అభివృద్ధి

పీలేరు : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందుతున్నాయని జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా అన్నారు. శనివారం పీలేరు పట్టణంలోని జెండామాను వీధి, గాంధీ రోడ్డు తదితర ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో చేపట్టిన పథకాలకు వ్యత్యాసాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని వచ్చే ఎన్నికల్లో కూడా జగనన్నను ఆదరించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కడప గిరిధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హుమయూన్, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ ఆనంద్, ఎంపీటీసీ జోహార్, నాయకులు రెడ్డిబాషా, కాలనీ చిన్న, మునీర్, అబీద్, పెద్దోడు, అల్లాబక్షు, హబీబ్, షాజహాన్, గ్రామ వలంటీర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి : జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు మండల పరిధిలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు నిరాటంకంగా అమలవ్వాలంటే ప్రతి ఒక్కరూ మళ్ళీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమాలలో సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, సర్పంచ్ గంగయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, వేణుగోపాల్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, విశ్వనాథ, ఖాదర్ బాషా, దేవేంద్ర, ప్రదీప్ రెడ్డి, నరేష్, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: మండలంలోని గండబోయనపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చేపడుతున్న సంక్షేమ పథకాలపై వివరించి, వారి సంతృప్తినికి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, కిట్టు, వలి, శీనా, రాజన్న, మౌలా, పురుషోత్తం, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ : జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని గుర్తించి మన భవిషత్ జగనన్నే అని మరొక్క సారి అవకాశం ఇవ్వాలని ఎంపీపీ శ్రీదేవి కోరారు. శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీలోని బీసీ, ఎస్టీ కాలనీలు, నీలప్పగారిపల్లె గ్రామాల్లో సచివాలయ వలంటీర్లు, గృహసారథులతో కలిసి జగనన్నే మా భవిషత్– మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి జగనన్న ప్రభుత్వంలో పొందిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్, రెడ్డెప్ప,శ్రీనాథ్, సచివాలయ కన్వీనర్ నాగరాజ, నాయకులు ఉదయ్‌భాస్కర్, సునీత పాల్గొన్నారు.

కురబలకోటలో..

కురబలకోట : మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్..మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం వాడవాడలా మార్మోగుతోంది. నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలసి ఊరూరా ఇల్లిళ్లు తిరుగుతున్నారు. గడప గడపకు వెళ్లి స్టిక్కర్లు అతికిస్తున్నారు. సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. శనివారం ఎర్రబల్లె, కురబలకోట, కనసానివారిపల్లె, మట్లివారిపల్లె, ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె తదితర గ్రామాల్లో సమరోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్ ఆర్‌కె కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ ఎం.సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ రజనీ, అమరనాథరెడ్డి, అలీమా,వేణు,బాలకృష్ణ, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

రామసముద్రం : ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. శనివారం జగనన్నే మానమ్మకం కార్యక్రమాన్ని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ నాయకులు నిర్వహించారు. ఇంటింటా వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి స్టిక్కర్లను అతికించారు. పథకాలు మంజూరుపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి, జెడ్పీటీసీ రామచంద్రరెడ్డి, వైస్ ఎంపీపీలు రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, కన్వీనర్ భాస్కర్‌గౌడ్, నంద, సర్పంచులు ఉదయ్ శంకర్‌రెడ్డి, ఆదినారాయణ, రెడ్డెప్పనాయుడు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పీలేరు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



కలికిరి: రంగనాథపురంలో ఇంటింటి ప్రచారం



వాల్మీకిపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు



కలకడ: ప్రచారం చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి



కనసానివారిపల్లెలో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న నాయకులు

సకాలంలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

మదనపల్లె సిటీ: విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు సకాలంలో పంపిణీ చేయనున్నట్లు మోడల్ స్కూల్స్ రాష్ట్ర డైరెక్టర్, జిల్లా పదో తరగతి పరీక్షలు, జగనన్న విద్యాకానుక పరిశీలకులు మార్తల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారులతో జగనన్న విద్యాకానుక పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే వారం జిల్లాకు జగనన్న విద్యాకానుక కిట్లు వస్తాయన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి నాల్గో విడత కిట్లలో 9 రకాల వస్తువులను 1–10 తరగతుల విద్యార్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందు కోసం జిల్లాలోని 30 మండలాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో నమోదు చేసిన విద్యార్థుల సైజుల ప్రకారం యూనిఫారం, షూలు ఇవ్వాలన్నారు. కిట్ల పంపిణీకి ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఎంఈఓ, హెచ్‌ఎం, మండల ఇంజనీర్, ఏపీఎంలు ఉంటారన్నారు. కిట్లు స్టాకు పాయింట్లులో పెట్టి మండల పరిధిలోని పాఠశాలలకు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం రెడ్డన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు మాస్‌కాపీయింగ్ జరుగుతున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల గదులను పరిశీలించారు.



మాట్లాడుతున్న జగనన్న విద్యా కానుక పరిశీలకుడు మార్తల వెంకటకృష్ణారెడ్డి

విద్యాకానుక కిట్లు భద్రంగా ఉంచాలి

గుర్రంకొండ : ప్రభుత్వం సరఫరా చేసే జగనన్న విద్యాకానుక కిట్లు భద్రంగా ఉంచాలని రాష్ట్ర జగనన్న విద్యాకానుక సర్వీసెస్ జేడీ వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శనివారం గుర్రంకొండలోని తెలుగు జెడ్పీహైస్కూల్ భవనాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేసే జగనన్న విద్యాకానుక కిట్లు వారం రోజుల్లో మండలకేంద్రాలకు సరఫరా అవుతాయన్నారు. వీటిని మంచి రక్షణ ఉన్న భవనాల్లో భద్రంగా ఉంచాలని ఆదేశించారు. వర్షానికి తడవకుండా, కిటికీలు, తలుపులు, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండే భవనాల్లోనే ఉంచాలన్నారు. ఈవిషయమై మండల విద్యాశాఖ అధికారులు చొరవ చూపాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎంవో కరుణాకర్, ఎంఈఓ సురేంద్రబాబు, హెడ్మాస్టర్ మదన్‌మోహన్, డేటా ఆపరేటర్ సిద్దేశ్వర్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

వాల్మీకిపురం : పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని అన్నమయ్య జిల్లా డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. శనివారం పట్టణంలోని హసన్‌ఖాన్‌వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. వ్యాక్సిన్ వేయించుకునేందుకు వచ్చేటప్పుడు ఎంసీపీ కార్డు తప్పక తెచ్చుకోవాలన్నారు. మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని, నీలి ఆకాశం కోసం అంతర్జాతీయ స్వచ్ఛ వాతావరణం పోస్టర్స్ ఆవిష్కరించారు. డాక్టర్ కీర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.



టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి

పీలేరు రూరల్ : మండలంలోని యర్రగుంటపల్లె పంచాయతీ ముస్లిం కాలనీ (జగన్న లేఅవుట్)లో ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పి. నీరజచంద్రారెడ్డి అన్నారు. శనివారం ముస్లిం కాలనీలో బోరుకు, కొళాయిలకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో మొత్తం 109 ఇళ్లు ఉన్నాయని, రూ. 5 లక్షల వ్యయంతో బోరు, మోటారు, పైపు లైను, ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలనీకి శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుల్లెట్ శేఖర్, మాజీ సర్పంచ్ ధర్మరాజు, నాయకులు మోహన్‌బాబు, సి.వి. రమణ, సురేంద్ర, మల్లి, తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వేసవిలో ఎక్కువగా నీరు సేవించాలి

కలకడ : వేసవిలో ప్రతి ఒక్కరూ ఎక్కువగా నీరు సేవించాలని డాక్టర్ జవహర్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని గంగాపురం పంచాయతీ కత్తివారిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు అందించారు. ప్రతి నెలా గ్రామానికి వైద్య బృందం వచ్చి నెలవారి బీపీ, షుగర్, కిడ్నీవ్యాధి గ్రస్తులకు చికిత్స, గర్భిణులకు సూచనలు ఇస్తారన్నారు. శిబిరంలో 96 మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ సుబ్బరత్నమ్మ, సిబ్బంది ముజీబ్‌బాషా, శివప్రసాద్ బాబు, లక్ష్మిదేవి, గోపిక్రిష్ణ, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జవహర్‌బాబు

నేటి నుంచి తెట్టు పాలేటి గంగమ్మ జాతర

కురబలకోట : మండలంలోని తెట్టు పాలేటి గంగమ్మ జాతర ఆదివారం సాయంత్రం గొల్లపల్లె వాస్తవ్యుల చేతుల మీదుగా అఖండ దీప ప్రజ్వలనతో ప్రారంభమవుతుందని గ్రామ సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పూజారి అంజి తెలిపారు. సోమవారం బోనాలు, మంగళవారం రాత్రి జాతర, చాందినీ బండ్లు మెరువన వైభవంగా సాగుతుందన్నారు. బుధవారం తిరునాల, కళ్లి పాటు కార్యక్రమం జరుగుతుందన్నారు. జాతరకు గట్టి బందోస్తును ఏర్పాటు చేసనట్లు రూరల్ సర్కిల్ సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ సుకుమార్ శనివారం తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు మృతి

రామసముద్రం: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు, రామసముద్రం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామసముద్రం మండలం మూగవాడి పంచాయతీ ఎం.గొల్లపల్లికి చెందిన రైతు డి.చంద్రయ్య (50) శుక్రవారం రాత్రి ఇంట్లో విషం తాగి అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబీకులు గుర్తించి 108 వాహనంలో చికిత్స నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ మెరుగుపడకపోవడంతో కుటుంబీకులు అతన్ని శనివారం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రైతు చంద్రయ్య శనివారం రాత్రి మృతి చెందాడు. చంద్రయ్యకు గతంలోనే భార్య చనిపోవడంతో పిల్లలను పోషించుకుంటూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. చంద్రయ్య చనిపోవడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

లక్కిరెడ్డిపల్లె: అభాగ్య పిల్లలు, తల్లిదండ్రి లేని పిల్లలు మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులు మరణించి అనాథలుగా ఉంటూ పోషణకు దూరంగా ఉన్న పిల్లలు, తల్లి వితంతువు, విడాకులు తీసుకున్న అలాంటి వారి పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధికి గురై పిల్లలు అనాథలుగా ఉంటే వారు అర్హులన్నారు. ఇలాంటి పిల్లలకు కేంద్ర ప్రభుత్వం నెలకు రూ. 4 వేలు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అనాథ పిల్లలు, బాల కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 15వ తేదీలోపు పూర్తి చేసిన దరఖాస్తులను ఆయా గ్రామ సచివాలయంలోని మహిళా పోలీసులకు అందించాలన్నారు.

అన్నదానం

రామాపురం : అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులు అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణానికి చెందిన సి.లక్ష్మిపతి 15 వర్ధంతి సందర్భంగా భార్య కృష్ణకుమారి ఆర్థికసౌజన్యంతో బండపల్లె ప్రేమాలయంలోని వృద్ధులకు అన్నదాన నిర్వహించారు.

యునాని మందులతో ఆరోగ్యం

తంబళ్లపల్లె : ప్రజలకు యునాని మందులు వాడితే పలు జబ్బులు నయమై ఆరోగ్యం చేకూరుతుందని డాక్టర్ ఖాద్రి తెలిపారు. స్థానిక వైద్య విధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలోని యునాని ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్యాస్ట్రిక్, మలబద్ధకం, అలర్జీ, మోకాళ్లనొప్పులు, మొలలు, జాం డీస్ (కామెర్లు), చర్మవ్యాధుల నివారణకు ఈ మందులు ఎంతగానో దోహదపడుతాయన్నారు. యునాని విభాగంలో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఖాద్రీ

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం

వాల్మీకిపురం : ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఓపీ శాతం పెంచాలని, మందుల కొరత రానివ్వకుండా మౌలిక వసతుల కల్పన మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రుల్లో వచ్చే రోగులను బయటి ప్రాంతాల ఆసుపత్రులకు రెఫర్ చేయకుండా ఇక్కడే మెరుగైన వైద్యం అందిస్తూ ప్రజలకు ఆసుపత్రులపై నమ్మకం కలిగించాలన్నారు. రోగులతో ప్రేమ పూరితంగా మెలగాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7కోట్లతో 50 పడకల భవనాల నిర్మాణం త్వరలో పూర్తి చేసి మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసుపత్రి ఆవరణలో పచ్చదనం, పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు, కేశవ రెడ్డి, కువైట్ శంకరాచారి, డాక్టర్లు సోని, హర్షిత రెడ్డి, లేఖ్య, శ్రీలక్ష్మి, పిజి స్వామి, సిఐ నాగేంద్ర, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల ఆనంద రెడ్డి, శ్రీధర్‌రాయల్, నీశ్లభాస్కర్, మదనమోహన్ రెడ్డి, మానవత సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వైభవం..లక్ష్మీనరసింహుడి కల్యాణం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. శనివారం స్వాతి నక్షత్రం కావడం, ఇదేరోజు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్ని అకట్టుకొంది. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టు వస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు. కార్యక్రమంలో అర్చకులు గోపాలాబట్టర్, కృష్ణ, అనిల్, రాజు, గోకుల్ స్వాములు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మాలల చైతన్యాన్ని తాకట్టుపెట్టవద్దు

మదనపల్లె : వ్యక్తిగత ప్రయోజనాల కోసం మాలల చైతన్యాన్ని తాకట్టుపెట్టవద్దని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం దళిత నాయకుడు మల్లెల వెంకట్రావ్‌ను హెచ్చరించారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణ విషయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండగా, ఈ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా అవకాశం కోసం పైరవీలు చేసి పదవి రాకపోవడంతో కిమ్మనలేదు. మాలలకు అందే సంక్షేమ పథకాల అమలులోనూ, మాలలపై జరిగిన దాడుల విషయంలోనూ నోరు మెదపని మీరు మాలల వర్గీకరణలో పాతపాడుతున్న చంద్రబాబుకు మద్దతుగా, నేడు జగన్ అంతం.. మాలల పంతం అంటూ రాజమహేంద్రవరంలో శంఖాన్ని పూరిస్తారా ? మాలలపై జరిగిన దాడుల సంఘటనలో ప్రతిఘటించిన పాత్ర మీదేమైనా ఉందా? అంటూ నిలదీశారు. ఈ రోజు మాల ఉద్యమకారులు మొక్కవోనిధైర్యంతో అంబేడ్కర్ బాటలో నడుస్తున్నారు. వారిని వ్యక్తిగత లబ్ధి కోసం పెడదారి పట్టిస్తున్నారు.

మాలల పట్ల మీధోరణిలో మార్పు రాకపోతే ప్రగతిశీలశక్తులు, ప్రజాస్వామ్యవాదులు మీకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మాలల ప్రధాన అంశమైన ఎస్సీ వర్గీకరణపై కలిసి వచ్చే శక్తులను కలుపుకుని వెళ్లాలని, లేకుంటే మీరు చరిత్రహీనులు అవుతారని హితవు పలికారు.

ముగిసిన రాములోరి ఉత్సవాలు

రాజంపేట టౌన్ : తొమ్మిది రోజుల పాటు నియోజకవర్గ వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో కొనసాగిన శ్రీరామనవమి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. తొమ్మిదవ రోజు అనేక ప్రాంతాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా కల్యాణం అనంతరం చేపట్టే ఉత్సవమూర్తులను ఊరేగించడం, వసంతోత్సవ కార్యక్రమాలు వివిధ ప్రాంతాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు, వసంతోత్సవ కార్యక్రమాల సందడి కనిపించింది. యువతీయువకులు, చిన్నారులు, పెద్దలు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.